అపూర్ణ చిత్రాలు

'హృదయిని'

తూలికాభూషణుడు తన యలవాటు చొప్పున ఆ విశ్రాంత ఏకాంతసీమమయిన యిసుక తిన్నెల చెంతకు చేరాడు. అది సంధ్యాసమయం. చీకట్లు అలుముకోటానికి ఇంకా చాలావ్యవధి ఉంది. దూరాన యూనివర్సిటీ హాస్టలు రేడియో అస్పష్టంగా ఏవో హిందూస్థానీ గీతాలు ఆలాపిస్తూంది. భూషణుడికెదురుగా గంభీరముద్రతో తన పురాతన అస్తిత్వాన్ని చూపించుతూన్న ఆ విశాలపర్వతము, దానిపై మసలుతూ ఏవో మంతనాలాడుతున్నట్లున్న హిమధూమం, క్రిందికి దిగివస్తున్న ధేనుసంతతి, గగనతలాన లోకబాంధవుడు వెదజల్లిన అరుణరేఖలతో ఆటలాడుకొంటున్న రంగురంగుల మేఘాలు - భావుక హృదయుడయిన అతన్ని అనిర్వచనీయానందంలో ముంచివేసినయి. అమోఘంగా ఉన్న ఆదృశ్యాన్ని తన 'అల్బం'లో చిత్రించాలని అతని మనసు వేగిరపడింది. మరుక్షణమే ఆల్బంలో ఒకపేజీపై అతని పెన్సిలు తీవ్రగతితో ఉన్మత్తరేఖల్ని గీయసాగింది. కొన్ని నిముషాల్లోనే ఆ హృదయస్పందనమయిన దృశ్యం 'స్కెచ్'గా తయారయింది. కొత్తవాళ్ళ కాబొమ్మ పూర్తి అయినదిగానే తోస్తుంది. కాని అతృప్తితో అతని పెన్సిలు ఇంకా ఆ చిత్రంలో అటుఇటు సంచరిస్తునే ఉంది.

కొంచెము దూరంలో ఒక ఆంగ్లవనిత విహారానికి వచ్చినట్లు కనుపించింది, భూషణుడు ఒకసారి నలువైపులా తన దృష్టిని సారించినప్పుడు. కాని అతడు తన బొమ్మను చిత్రించటంలో లీనమయిపోయాడు. ఆ సుందరితోపాటు ఆమె సహచరి ఒక సీమకుక్క దారి చూపిస్తూంది.. ఆ మందగామిని భూషణున్ని సమీపించింది.

"మీ ఏకాంతాన్ని భంగం చేస్తున్నందుకు మన్నించాలని కోర్తా!"

భూషణుడు తలపైకెత్తి చూచాడు — ఎదురుగా ఒక అపరిచిత ఆంగ్లసుందరి! అమాయికమయిన వీక్షణాలతో ఉన్న ఆమె వినీలనయనాలు కనుపించినయి. ముందుగా ఆమే పలుకరించటం - అందులో అచ్చమయిన ఆంధ్రంలో! — భూషణున్ని విస్మయావృతుణ్ని చేసినయి. వెంటనే శిష్టాచారంతో — "ఫరవాలేదు. ఇందులో ఏమి భంగముంది!" అని ప్రత్యుత్తరించాడు.

"ఆ చిత్రాన్ని నేను చూడొచ్చా! అల్లంత దూరాన్నుంచి చూస్తూన్నా — మీరేదో చిత్రాన్ని గీస్తున్నట్లు గమనించా" వినయపూర్వకంగా అడిగిందా ఆంగ్లసుందరి.

సాదరంతో భూషణుడు తన అల్బంను ఆమె కరకమలాల్లో నుంచాడు. ఆమె తన విశాలముగ్ధనయనాలను ఆ చిత్రంపై ప్రసరింపజేసింది. సమ్ముఖంలో ఉన్న ఆ ప్రత్యక్ష ప్రకృతి దృశ్యం మనోహరంగా చిత్రితమయి ఉంది; శ్రద్ధ,ఉత్కంఠతతో చూచింది.

ఆమె తన చిత్రాన్ని తదేకధ్యానంతో విలోకిస్తున్నప్పుడు ఆమె సహజసౌందర్యాన్ని భావుక చిత్రకారుడయిన భూషణుడు అవలోకింపకుండా ఉండలేకపోయాడు - అది నిజమయిన భారతీయ హిందువునకు ఉచితమయింది కాకపోయినా! షేక్స్పియరు, కాళిదాసు మహాకవుల మధురమంజుల కృతుల్లో వచ్చిన విమలమోహన యామినులను స్మృతిపథంకు తెస్తూందామె. దర్పరహితమయిన భారతీయ సాధారణ

నైపథ్యరీతితో ఆ ఆంగ్లశరీర భారతీయ, ఆంగ్ల, సౌందర్యసమ్మేళన మూర్తి భవించినట్లుంది.

"మీరు నిజంగా భారతీయ చిత్రకళాకారుల ప్రతినిధిగా తోస్తుందిచిత్రంవల్ల! "విధేయాన్వితయై పలికిందా పల్లవాధరి.

మధురస్వనమిళితమైన ఆమె ప్రశ్న భూషణుడి తన్మయత్వాని సంచలితం చేసింది. "మీ ప్రశంసకు తగినంత అర్హుణ్ణి కాను. నేను ఇంకా చిత్రకళా విద్యార్థినే - ఆచార్యుడినిగాను!" అని వెంటనే ప్రత్యుత్తరించాడు. ఆమె ముగ్ధురాలయింది.

"మీ పరిచయభాగ్యాన్నిస్తారని ఆశిస్తున్నా" సవిధేయంగా అడిగిందామె.

"ఇక్కడ యూనివర్సిటీలో బి. ఏ. (ఆనర్సు) చదువుతున్నా. తూలికాభూషణుడని పిలుస్తుంటారు నన్ను"

ఆమె స్నేహమయ వీక్షణాలతో భూషణుని ఆపాదమస్తకం పరికించింది. తరువాత, ఆమె అల్బం లోని ఒక్కొక్క చిత్రాన్ని చూడసాగింది. సూర్య భగవానుడు తన అంతిమ అరుణారుణ కిరణాలతో ఆ గౌరకన్యయొక్క మృదులసమున్నతకపోలాల్ని ప్రకాశమానం చేస్తున్నాడు. మందపవనాలు మెల్లగా ఆమె ఉంగరాలజుట్టుతో ఆటలాడు కొంటున్నాయి. ప్రకృతి విభావరిరాకను కోరుతుంది.

ఆ ఆంగ్లరమణి అల్బంలోని సగము చిత్రాలనైనా చూడలేదు, చీకట్లు మెల్లగా దిక్కుల నాక్రమించినయి. ఆమె అల్బంను భూషణుని చేతికిస్తూ - "మీ చిత్రలేఖనం నన్ను పూర్తిగా ఆకర్షించింది. మీబసఎక్కడ? చీకటి పడుతుంది. నేను మీకు కొంచెం శ్రమ ఇచ్చాను!" అంది.

"ఇందేమి శ్రమ ఉంది? నా బస ఆ కనుపిస్తున్న యూనివర్సిటీ హాస్టలే. ఆఁ. మీ పేరేమిటో తెలిసికో వచ్చునా!" చిఱునగవుతో అల్బంను చేతుల్లో త్రిప్పు కుంటూ అడిగాడు భూషణుడు.

"శీలా హైవర్ట్. చూడండీ, ఆ కొండకు దగ్గరగా ఉండే బంగళా, అదేమేముండేచోటు, మీ కభ్యం తరం లేకపోతే మీ విశ్రాంతిసమయాల్లో మాయింటికి వస్తారని కోర్తా!" అని నమ్రతాపూర్వకంగా ఆమె పలికింది.

"మీ ఆహ్వానానికి కృతజ్ఞుణ్ని." భూషణుడు మందహాసంతో పలికాడు. ఇద్దరూ మెల్లగా నడువ సాగారు - ఆమె ప్రక్కనే ఆమె కుక్కాను. కొంత దూరంనడిచారు. తనవెంటనే వస్తున్న శీలా హైవర్టును చూచి ప్రయత్నపూర్వకంగా భూషణుడన్నాడు - "మీరు నా వెంటొస్తూ బసను మరచిపోయినట్లుంది!"

ఆమె తనతో నడుస్తున్న కుక్కను తీసికొని హృద యాన చేర్చుకుంటూ, "లేదు. -ఆ చీలిపోయేదోవే మా బంగళాకు పోయేది. మీరు తప్పకుండా మా యింటికి వస్తారుకదూ!" అని అంది.

"ప్రయత్నిస్తా!" భూషణుడన్నాడు.

ఇంతలో ఆమె బాటవచ్చింది. భారతీయవైఖరిలో చేతులు జోడించి "నమస్తే!" అని ఆమె మసక చీకట్లలో తన బసవైపు నడచివెళ్లింది.

♦ ♦ ♦

ప్రతిసాయంత్రమూ తూలికాభూషణుడు ఆ చిర పరిచితమయిన ప్రశాంత - ఏకాంత ప్రదేశానికి వెళు తున్నాడు. అటు శీలా హైవర్ట్ కూడ వస్తున్నది. ఆ ఉత్తుంగ సికతాతలమున భూషణుడి దగ్గర కూర్చొని సంధ్యాప్రకృతిని విలోకిస్తూ హృదయపూర్వకంగా మాట్లాడుతుంది. ఆమె తెలుగుమాటలు, చిఱునగవు, విశాల నయనాలు, సరళభావము, అన్నీ అతని హృదయంలో ఒక విధమయిన స్నేహపూరిత భావాల్ని నింపినయి. ఆ యిద్దరి సంభాషణ చాలా వరకు చిత్రలేఖనం గూర్చే ఉండేది. కొన్నాళ్ళ తరువాత భూషణుడు తెలుసుకొన్నాడు - ఆమెకూడా ఒక చిత్రకారిణని. మరుసటిరోజే ఆమె యింటికి వెళ్ళాలని అనుకొన్నాడు.

మరుసటిరోజు సాయంత్రం. ఆ ఏకాంతస్థలాన శీలా హైవర్త భూషణున్ని యథారీతిగా కల్సికొంది. "తూలికాభూషణ్ గారూ! మీరీసాయంత్రం మా యింటికి రాక తప్పదు. ఇందుకు మీరన్యథా ఆలోచింప కుండా అంగీకరిస్తారని నా కోర్కె!"

"నే నీవేళ మీ స్వాగతం లేకపోయినా మీయింటికి రావాలని నిశ్చయించుకొన్నా. అయితే మీరు మాత్రం మీ చిత్రాలను నాకు చూపిస్తారు కదూ!" అని వెంటనే భూషణుడన్నాడు.

ఆమె లేతకెంపు, తేలిక పెదవులపై చిఱునగవు చిందింది. సంతోషభరితురాలయింది. అంగీకార సూచకంగా ఆమె నయనాలేమిటో పలికినయి.

ఇద్దరూ ఆమె బంగళావైపు బయలుదేరారు. విభావరియగుట కింకా విలంబనముంది. ప్రకృతి పక్షుల కలకలారవములతో ఉల్లాసపూరితంగా ఉంది. దూరాన హోస్టలు రేడియోనుంచి ఏదో యుగళగీతము వినపడుతుంది.

బంగళా సమీపించింది; ఒక రమణీయ పుష్పవనం మధ్యలో ఉంది. వికసితపుష్పలతా గుల్మాదులచే ఆ పుష్పవాటిక ఆనందనిలయంగా ఉంది. భూషణుడూ, శీలా ఇద్దరూ గేటుదాటి లోపలనున్న బంగళాపంచలో ప్రవేశించారు. ద్వారముదగ్గర ఒక సేవకుడున్నాడు. వాడు శీలాను చూచి ఆంగ్లేయ పద్ధతిలో నమస్కరించాడు.

"బాబా ఉన్నాడా?" శీలా వాడిని ప్రశ్నించింది.

"ఇంకా రాలేదు మాడమ్!" వాడు వినయంగా జవాబిచ్చాడు.

శీలా భూషణున్ని లోనికి తీసికెళ్ళింది. అది ఒక విశాలము, సుందరము అయిన హాలు. చక్కని రీతిలో కుర్చీలు, మేజాలు తీర్చిఉన్నయి. ఒక మేజాదగ్గఱ యిద్దరూ కూర్చొన్నారు. ఒక పరిచారకుణ్ని పిలిచి వాడికేదో సంజ్ఞ చేసింది. రెండుమూడు నిముషాల్లో వాడు కాఫీ, బిస్కట్లతో ట్రేను తెచ్చి వాళ్లిద్దరి ముందున్న టేబిలుపై పెట్టాడు.

శీలా విధేయతతో, స్నేహమయ వీక్షణాలతో ఆ అల్పాహారాన్ని చూపిస్తూ, "తీసుకోండీ!" అన్నది.

"ఎందుకండీ! ఇవి!" భూషణుడు తన స్వాభావిక మందహాసంతో ప్రత్యుత్తరించాడు. కాని శీలా చిఱునగవుతో ట్రేను అతడిదగ్గఱగా ఉంచింది.

కాఫీ సేవనముతరువాత శీలా భూషణున్ని మేడపైకి తీసికెళ్ళింది. అదొక అలంకృతమయినగది. గోడలకు అయిదారు చిత్రాలు తగిలింపఁబడియున్నయి. భూషణుడు ఒక్కొక్క చిత్రాని సమీపించి పరికింపసాగాడు. అన్నీ శీలా చిత్రించినవే. అందులో రెండు బొమ్మలు భారతీయ చిత్రకళారీతిలో చిత్రితమయిన గొల్లపిల్లలబొమ్మలు. రంగులుఆకర్షణీయంగాఉన్నయి. మఱి రెండు కథకళి నాట్యభంగీమల చిత్రాలు. కాని వాటిలో భారతీయ కన్యాసౌందర్యపేశలత కొరవడి ఉంది.

"ఈ రెండుచిత్రాలు చిత్రలేఖనంలో నాకున్న లోటును చూపిస్తున్నయికదూ!" అని శీలా మెల్లగా పలుకరించింది.

"లోటేముంది? మీ దేశానికి భిన్నమయిన మానవ రూపచిత్రణం అయినందువల్ల కొంత హంగు తగ్గింది. అంతే!" అన్నాడు భూషణుడు.

మరొకటి ప్రకృతి దృశ్యమున్న చిత్రం. అక్కడ ప్రక్కనున్న కిటికీలోనుంచి కనుపించే దృశ్యమే అది, అని భూషణుడు గ్రహింపగలిగాడు. ఆ దృశ్యం చాల బాగుంది. ఆ చిత్రం దగ్గర నిలువబడి, "ఈ ప్రశాంతమయిన గదిలో కూర్చుండి ఇటువంటి రమణీయదృశ్యాన్ని తిలకిస్తుంటారన్న మాట!" అని తన సంతోషాన్ని వెలిబుచ్చాడు భూషణుడు.

"మీరు విహారానికివచ్చి కూర్చునే ప్రదేశం కంటేనా!"

"ఎందుకు కాదు!"

"ఊం. నాకు మీరు కూర్చునే చోటే చాలా ప్రశాంతంగా ఉంది."

"ఈ అభిప్రాయం నామీద మీకున్న స్నేహాభిమానాలవల్ల కలిగిందని భావిస్తున్నా!"

"ఏమయినా అనుకోనండి!"

తరువాత - అక్కడే ఒక అందమయిన పియానో వాద్యముంది; దానిముందు కూర్చొని, "మీకక్కడ సంగీతం వచ్చుననుకుంటా!" అని భూషణుడు ప్రశ్నించాడు.

"అంటే మీకక్కడా సంగీతంలో...!" శీలా తిరిగి చిఱునవ్వుతో పలికింది.

"కొద్దిగా ప్రవేశముంది."

"అయితే ముందు మీరొకపాట వాయించి చూడండి!"

భూషణుడిలో ఉన్న సంగీతలాలస శీలామాటల చేత ఉత్సాహభరితమయింది. పియానోకీళ్ళపై అతడి వ్రేళ్లు అటుయిటూ నడకలు, పరుగులు తీసినయి. ప్రక్కనేనిలబడి శీలా తన్మయత్వంతో ఆట్యూన్ను, ఆలకిస్తూండిపోయింది. ట్యూను పూర్తయింది.

"మార్వెలస్! మెలోడియస్!!" భూషణుడి దగ్గఱగావస్తూ అన్నది శీలా.

ఇంతలో - 'లోపలకు రావచ్చునా?' అన్న మాటలు ద్వారం బయటనుంచి వినబడ్డయి.

"బాబా!" అని శీలా ఆనందాతిశయంతో కొంచెము పెద్దగా పల్కింది. ఆమె ద్వారం చెంతకు వెళ్ళి తనతోపాటు ఒక వృద్ధుడ్ని - ప్రశాంత వదనుడిని లోనికి తీసుకొచ్చింది. అతడు ప్రేమతో తనచేత్తో ఆమె నడుమును పట్టుకొని ఉన్నాడు. భూషణుడు వెంటనేలేచి అతడికి అభివాదనం చేశాడు.

"వీర్నే బాబా! నేను నిత్యం సాయంత్రం కల్సుకొని, చిత్రలేఖనాన్నిగూర్చి చర్చించేది, వీరే ఆ తూలికా భూషణులు?" అని శీలా ప్రమోద సంభ్రమాల్తో పల్కింది.

వృద్ధుడి తెల్లని గడ్డముపై ఉన్న పెదవులపై ఒక చిఱునగవు తొణికింది. అతడి నేత్రాలు జ్ఞాన పూరితంగా ఉన్నయి.

"మా నాన్నగారు!" అని శీలా భూషణుడితో అన్నది. వృద్ధుడు సంతోషంతో "తూలికా భూషణులుగారూ! మీరింతకుముందు వాయించిన ట్యూను నన్నెంతో మైమరపించింది సుమా!" అని ముక్తసరిగా పలికాడు. అతడిమాటల పొందిక అతడి విశాలహృదయాన్ని వ్యక్తం చేస్తున్నయి.

కృతజ్ఞతా విస్మయాలతో భూషణడన్నాడు. 'మీరింతవరకు బయటుండినాట్యూను వింటున్నారన్న మాట!"

అవునన్నట్లా వృద్ధుడు నవ్వాడు.

"మా భారతదేశ సంగీతం, చిత్రకళలపై మీకూ, శీలాకు ఇంత ప్రేమాభిమానాలున్నందుకు నేనేమి చెప్పకోవాలో తోచటంలేదు!" అన్నాడు భూషణుడు వినమ్రంగా.

"సంగీతం, చిత్రకళలనే అంటున్నారు మీరు-మీ తెలుగు భాషా సంబంధమయిన పరిశోధన కూడా చేస్తున్నారు మా బాబా!" అని శీలా అభిమాన పురస్సరంగా పల్కింది.

"బ్రౌనుదొరగారిని గుర్తుకు తెస్తున్న మీకు నా అభివందనాలు!" అని ఆ వృద్ధుడికి తన ఆనందాన్ని తెలుపుకొన్నాడు భూషణుడు.

♦ ♦ ♦

కాలదేవత తన వయసును పెంచుకుంటూంది. విరామం లేకుండా పగళ్లు - రాత్రుళ్లు గడచిపోతున్నయి. తూలికాభూషణుడికి శీలా, బాబాలనుంచి యెంతో ఆదరాభిమానాలు లభించినయి. వారి బంగళాకిప్పుడతడు నిరభ్యంతరంగా పోయివస్తూన్నాడు. ఒకప్పుడు శీలాతో సంగీత చిత్రలేఖనాలని గూర్చిన

సంభాషణ. మరొకప్పుడు బాబాతో భాషావిషయిక మయిన చలోక్తులు. తానెరిగిన చిత్రలేఖనారీతుల్ని శీలాకు నేర్పుతుండేవాడు. వారిద్దరి మిత్రత్వాన్ని చూసి బాబా ఎంతో మురిసిపోతుండేవాడు. శీలాను భూషణుడి సుగుణములు, చిత్రలేఖన సంగీతకళా కౌశలమూ పూర్తిగా కైవశం చేసికొన్నయి. ఆమె నిజంగా భూషణుడు కనుపింపని రోజున విహ్వాలి అయిపోయేది. పాఠకులు, కథకులు ఊహించేరీతిలోనే శీలాకు భూషణుడితో ఉన్న స్నేహము గాఢప్రేమగా మారింది. భూషణుడు కళాదృష్టితో శీలాను - ఆమె సౌందర్యాన్ని ప్రేమించాడు. ఆమె సౌందర్యాన్ని తన చిత్రాల్లో ప్రతిఫలింపచేశాడు. ఆ యిద్దరిమధ్య స్నేహబంధము - కళాపిపాస కల్మష రహితమై పోయింది. శీలాలోని నిర్మల స్వభావము భూషణుడి చిత్రకళను సజీవంగా చేసింది; ఆమె ప్రతిరూపాల నెన్నిటినో చిత్రించాడు. చిత్రకళయందిప్పుడతడు పరిపూర్ణ కుశలుడు.

భూషణుని ఆనర్సుపరీక్షలు పూర్తిఅయినయి. ఇంటికి రమ్మని తండ్రిగారి దగ్గరినుంచి ఆదేశం వచ్చింది. ఒక వారం రోజుల్లో తిరిగి వస్తానని శీలాతోచెప్పి - సెలవుతీసికొని తన గ్రామానికి బయలుదేరాడు. శీలా మనసులో ఎంతో ఖేదపడింది. సగము చనిపోయినట్లయింది. బరువెక్కిన హృదయంతో భూషణున్ని రైలెక్కించి తన బంగళా చేరిననాడు, బంగళా అంతా శూన్యంగా తోచింది. భూషణుడు కూర్చున్న కుర్చీలు - వాయించుతుండే పియానో - చిత్రించిన చిత్రాలు - అన్నీ చూచుకొని ఆమె దీనమయిపోయింది. తానెందుకు భూషణునికై యింత పరితపిస్తుందో - తన పరితాపానికి ఫలము దక్కుతుందో లేదో ఆమె కేమీ తోచలేదు. ఆమె యిప్పుడు విహ్వాలమూర్తి!

భూషణుని తండ్రి కేశవబాబు తన పుత్రుడు బి. ఏ. (ఆనర్సు) పూర్తిచేసి వస్తాడని, ముందుగానే అతని పెండ్లికి ఏర్పాట్లనీ పూర్తిచేసి ఉంచాడు. ఒక లక్షాధికారిని వియ్యంకునిగా వరించాడు. అతని కుమారీరత్నమునిచ్చి భూషణుని పెండ్లి నిశ్చయించుకొని సిద్ధముగా ఉన్నాడు. ఇంటికివచ్చిన భూషణునితో ఆసమయాన పెండ్లిచర్చతెచ్చి ఆ మహోత్సవం వారంరోజుల్లో జరగాలని తెలియచేశాడు. మొదటినుంచి తండ్రిమాటల్లోనే నడిచే భూషణుడు అందుకు అంగీకరించాడు. పాపము! శీలా తన నెంత ప్రేమించింది! తనకోసం - తన చిత్రకళోన్నతికోసం ఎంత కాంక్షిస్తుండేది! తానిక్కడికివచ్చిన తర్వాత శీలా అక్కడెట్లుందో ఊహింపలేకపోయాడు!!

భూషణుని వివాహవార్త తంతిద్వారా శీలాకు చేరింది. ఎన్నిరకాల వార్తలు ఈ తంతి ప్రసారం చేస్తుంది! శీలా జీవిత పుష్పవాటికలో భీకరప్రళయ ప్రభంజనాలు వెదజల్లినదా తంతి! ఒకటి - రెండు రోజుల్లో భూషణుడు తిరిగివస్తాడని యెదురుతెన్నెలు చూస్తున్న శీలా ఆ పిడుగువంటి వార్తవిని యేమయిపోయిందో - ఆమెలా ఒక కళాకారునికి తన సర్వ కాంక్షల్ని అర్పించుకొన్న యేలతాంగి అయినా సరిగా ఊహించుకోగలదు! భూషణుడు తన్ను బాగా అర్థం చేసుకొన్నాడని ఊహించింది. ఇంత హఠాత్తుగా అతనికి పెండ్లి కాబోతుందని ఊహింపలేక పోయింది. తా నాంగ్లయువతి; అతడు భారతీయుడు. తమిద్దరి కలయికకీదేశంలో చోటులేదా! ఆలోచనలతో ఆమెకు పిచ్చెత్తిపోయింది.

♦ ♦ ♦

భూషణుని వివాహం అతివైభవంగా జరిగిపోయింది. వివాహ మహోత్సవానికి శీలావచ్చింది. భూషణుడెంతో బాగుందని మురిసిపోయే పియానో వాద్యాన్ని పెండ్లినాడతనికి బహూకరించింది. అవిలు వైన వస్తువును ఆ సౌందర్యఖనియయిన శీలా సమర్పించటం - ఆమెతో భూషణుడు చనువుగా మాట్లాడటం నిష్కల్మష హృదయులయిన వారిద్దరి చిఱునగవులు- పెండ్లికివచ్చిన పెద్దలనూ, బంధువులనూ ఆశ్చర్యంతో నింపేసినవి. మీదుమిక్కిలి భూషణుడు వేసిన చిత్రాల్లో శీలా ప్రతి రూపాలుండటం వారికింకా

విస్మయం కలిగించినయి. పెండ్లికుమారుడయిన భూషణునకు, శీలాకు సన్నిహిత సంపర్కమేమయినా ఉండి తీరుతుందని వారిలో కొందరనుమానపీడితులయ్యారు. ముఖ్యంగా భూషణుని నవవధువు - హేమను ఆ అనుమాన పెనుభూతం తనవశంచేసికొంది. ప్రత్యక్షంగా ఆమె తన భర్త - భూషణుడు శీలాతో చిఱునగవుల్తో సంభాషించటం చూచింది. ఆమె అబోధితహృదయంలో శంకాబీజాలు నాటుకుపోయి మొలకలెత్తినయి. రాత్రింబవళ్లామె ఆలోచనాపరంపరలతో వికలచిత్త అయిపోయింది. ఇంతకుముందే యింకొకరికి తనప్రేమను పంచియిచ్చిన ఒక యువకుని కిచ్చి తన జీవితాన్ని ఖేదపూరితం చేసారని ఆమె లేతమనసు దురభిప్రాయపడింది. శీలా ప్రేమనే అర్థం చేసికోలేకపోయిన భూషణుడు ఇప్పుడు హేమ ఆవేదను మాత్రం తెలిసికోగలడా! హేమ లజ్జాకులిత అని భావించాడు.

కొన్ని నెలలు గడచిపోయినయి ...

భూషణు డెప్పుడూ ఏవో క్రొత్తచిత్రాలను ఊహిస్తూ - చిత్రిస్తూ తనగదిలో - కల్పనా జగత్తులో లీనమయి ఉంటుంటాడు. నిజంగా యీ ప్రపంచంలో అతని ప్రేమను పూర్తిగా పొందగలిగింది ఒక్కటే. అదే - చిత్రలేఖనం! చిత్రలేఖనంమీద అతనికున్న వ్యామోహాన్ని హేమలో అసూయను రేకెత్తించింది! పరమాత్మా! విభిన్నప్రకృతులున్న పురుషునికి, స్త్రీకి దాంపత్యమెట్లా కూరుస్తావయ్యా!

ఇంతేకాకుండా, భూషణుడు అప్పుడప్పుడు విశాఖపట్టణంవెళ్ళి శీలా బంగళాలో కొన్నిరోజులపాటుండి చిత్రలేఖనము గావిస్తున్నాడు. అతనిలో పూర్వంవలెనే శీలాపై ప్రేమాభిమానాలు నిలచి ఉన్నయి. అతని దృష్టిలో శీలాయిప్పుడూ చిత్రలేఖన కళలో సహాధ్యాయినే! అతని ఆ అమాయిక హృదయాన్ని చూచి ప్రేమపరితప్తహృదయిని అయిన శీలా తనలో చిఱునగవు నవ్వుకొనేది. ఇప్పుడుకూడా కొన్నిరోజుల తరబడి తనదగ్గఱే ఉండే భూషణునితో యిల్లాగనేది-

"మీ హేమనువదలి యిట్లా పరస్త్రీలదగ్గఱ నాల్గురోజులెలా ఉండగలుగుతున్నారండీ మీరు?"

"పరస్త్రీలనగా!" అని భూషణుడు మందహాసంతో ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు సమాధానమేమియ్యాలో శీలాకు తోచలేదు ...

"నేను పరస్త్రీనేకదా!" అంది శీలా.

"అని నేనెప్పుడు భావిస్తానో అప్పుడిక భూషణుడు ఇక్కడకురాడు!" అని పక్కన భూషణుని నయనాల్లోకి చూసింది శీలా. ఇక మాటాడలేకపోయింది. కొన్ని నిముషాలు నిశ్శబ్దము.

"మీ హేమను ఒకసారిక్కడకు తీసుకురారూ?"

"తప్పకుండా!"

... నిజంగా ఒకనాడు భూషణుడు హేమతో విశాఖపట్టణంవెళ్ళి శీలాభవనంలో దిగాడు. శీలా యెంతోప్రమోదమొందింది. హేమను తనసహోదరిగా ఎంచి తన సహజ సరళ స్వభావంతో సాదరంతో సంభావించింది. హేమకు శీలా భవనము-ఉపవనమూ-ఆ ప్రకృతీ - తన్ను వెక్కిరించినట్లుగా కనుపించినయి. అక్కడకూడా భూషణుడు చిత్రించిన శీలా చిత్రాలు - ఆమెలో గూడుకట్టుకొన్న శంకను ఇంకా పోషకమయింది. హేమ మస్తిక మున్మత్తమయింది.

తాను భూషణున్ని మొట్టమొదట కల్సికొన్న చోటు, ఆపై ఇద్దరూ విహరించిన ప్రాకృతిక ప్రదేశాల్ని - అన్నీ హేమకు చూపించింది శీలా. ఇంత చనవుగా తిరిగిన ఆ శీలా తనభర్తతో దాంపత్యం చేయకుండా ఉందా! అని తన స్వాభావికమయిన వెఱ్ఱి ఊహాలతో అపోహాలోనే ఉండిపోయింది. హేమ కళారాధకుల్ని - కళాపిపాసుల్ని అర్థంచేసికోలేని వెఱ్ఱిది!

వేసవి తన భీషణస్వభావాన్ని రోజు రోజుకు పెంచుతూన్న రోజులవి. తూలికాభూషణుడు ఒకప్పుడు కాశ్మీరు వెళ్ళాలని అనుకొన్న తలంపును యిప్పుడు కార్యరూపంలో పెట్టాలని అనుకొన్నాడు. అక్కడి రమణీయమైన దృశ్యాలను అక్కడే ఉండి చిత్రించాలనే కాంక్ష అతడిని పురికొలిపింది. శీలా కూడా యిదే కోర్కెతో ఉన్న సంగతి అతనికి తెలుసు. వెంటనే ఆమెకొక లేఖ వ్రాశాడు - కాశ్మీరు వెళడానికి సిద్ధంగా ఉండమని.

హేమ తాను కాశ్మీరురావటం అనవసరమని, తన కారోగ్యంకూడా సరిగాలేదని చెప్పి భూషణుడితో కాశ్మీరుకు ప్రయాణంకాలేదు... భూషణుడు విశాఖ పట్టణమువచ్చి శీలాతో కాశ్మీరుకు బయల్దేరాడు. తన 'రీసర్చి' పనిలో తొందరగా ఉన్న బాబా వారిద్దర్నీ ''క్షేమంగా తిరిగిరండి' - అని దీవించి పంపాడు.

కాశ్మీరులో, శీలా భూషణులు ఒక హోటల్లో దిగారు. సింధూనదీతీరానే ఉన్న శ్రీనగరు ప్రాకృతిక మనోమోహన దృశ్యాల కాలవాలమయింది. వేసవి ఆ నగరంలో ప్రవేశింపలేక బేలయయి పోతూంది కదా! శీలా భూషణులు నిత్యమూ ఉదయమూ, సాయంత్రమూ చిత్రాలు చిత్రించుకోటానికి బహిర్ప్రదేశాలకు బయల్దేరేవారు. ఆ నదుల్లో తీర్చిఉన్న పడవల్లో ఎక్కి విహరించారు. మనసుకు వచ్చిన చోట్లలో ఆగి చిత్రాలను గీసుకొంటున్నారు.

వేసవికాలాన్ని అక్కడ వెళ్లబుచ్చటానికి ఎంత మందివస్తారు! హాయిగా ఒక నెలరోజులు గడచి పోయినయి. పుత్రికా ప్రేమ బాబాను శ్రీనగరుకు లాక్కొచ్చింది. ఆ నాటి సాయంత్రం-భూషణుడి జీవితాకాశాన్ని చీకట్లతో వ్యాపింపచేయబోయే సాయంత్రం - బాబా శీలా భూషణులు హిమఘన శకలాల్తో నిండిఉన్న ఆ ఉత్తుంగ శైలాన్ని ఎక్కుతున్నారు. అక్కడక్కడ చిఱుసెలయేరులు జల జల ప్రవహిస్తున్నయి. మంచుబండలు కొన్ని కరుగుతున్నయి.

“భూషణ్ గారూ! మీలాంటి స్నేహితుల్ని పొందటం నా జీవితంలో ఒక భాగ్యంగా తలుస్తున్నాను” అని శీలా అంది.

“నేనూ నాబొమ్మలకు తగిన మీలాంటివారిని ఎక్కడ సంపాదించుకోగలుగుతాను!” ప్రఫుల్ల వదనంతో భూషణుడు పలికాడు. బాబా వారిద్దరి మాటలువిని చిఱునవ్వు నవ్వుకున్నాడు. శీతల సమీరాలు తమపని సాగిస్తున్నయి. హైమశైలఖండాలు తమ నిర్మల స్ఫటికాకృతికి గర్విస్తున్నట్లుంది.

“శీలా! ఈ ప్రదేశం చాలా బావుంది. నా ఆల్బంలో చిత్రించుతా ఉండు. ఆ పెట్టెలోఉన్న రెడ్ పెన్సిలు ఇటివ్వు” అని భూషణు డక్కడ ఆగి అన్నాడు.

భూషణుడు అక్కడి ప్రకృతి దృశ్యాన్ని చిత్రింప సాగాడు. శీలా నాల్గడుగుల్లో - ప్రక్కనేఉన్న శిఖరాన్ని చూడడానికి నడిచింది. బాబా ఆ ఘనీభూత హిమశిలలను చూస్తూన్నాడు.

హఠాత్తుగా ఒక భయానకమయిన కేక - “బాబా!” అని ఆ ప్రదేశాన్ని ప్రతిధ్వనితం చేసింది. శీలా నడిచినవైపు చూశారు బాబా భూషణులు త్రుళ్ళిపడి. శీలా కనుపించలేదక్కడ! కొట్టుకునే గుండెలతో, అటు పరుగెత్తారు. అది శిఖరపు అంచు - ఆగిపోయినయి వాళ్ళ అడుగులు - ముందు అగాధమయినలోయ. ఆ లోయలో ఏదో

పడ్డట్టు పెద్ద చప్పుడయింది. శీలా నుంచున్న మంచు బండ అక్కడలేదు. క్రింద ఉద్వేగంగా ప్రవహిస్తున్న అగాధ హైమప్రవాహంలోంచి తుషార బిందువులు వెదజల్లబడుతున్నాయి.

బాబా భూషణులు ఉన్మత్తుల్లా శీలా! శీలా! అని అరచారు. శీలా!! శీ...లా!!! అని ఆ నిర్జీవ పాషాణ ప్రపంచం ప్రతిధ్వనించింది. బాబా ఆర్ద్రనయనాలనుండి సంతతధారగా అశ్రుబిందువులు జాఱినయి. భూషణుడి తేజోనయనాల్లో శోక తమస్సులు క్రమ్మినాయి.

♦ ♦ ♦

భూషణుడు ఇప్పుడు జీవన్మృతుడు. అతడికీ జగత్తు విపన్మయం. ఎప్పుడూ తనలో కలవరిస్తుంటాడు. శీలా వేసిన బొమ్మలు చూచుకొని వెఱ్ఱి నవ్వులు నవ్వుకుంటాడు. అతనికా బొమ్మల్లో శీలా సజీవంతో ఉండి పలుకరిస్తుంది. కాశ్మీరులో ఆమె తాను పూర్తిగా వేయని బొమ్మలు అలాగే అపూర్ణ చిత్రాలుగా ఉండిపోయినయి. లోకానికతడు ఉన్మత్తుడు. నామమాత్రానికి సతి అయిన హేమకు ఆ కళాకారుడు - ఆ నిర్భాగ్య చిత్రకారుడు ప్రేమ విహీనుడు!! ఆతని పిచ్చి శీలాకై పిచ్చి అంటుంది!

—o—

రీటా హెయిర్ టానిక్.

రీటా కురుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోట దొరుకును.

RITA
HAIR TONIC